సాక్షి
కాకినాడ


మంగళవారం । 15 । ఆగస్టు । 2023

I



కొబ్బరి చెక్కల ఆదాయం

పిఠాపురం: పాదగయ క్షేత్రంలో కొబ్బరి చెక్కల వేలంలో రూ.1.35 లక్షల ఆదాయం లభించినట్టు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఆగంటి ప్రభాకరరావు సోమవారం తెలిపారు.



కాలువలకు నీరు విడుదల

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 4,900,మధ్య డెల్టాకు 2,600,పశ్చిమ డెల్టాకు 7,500క్యూసెక్కుల నీటిని వదిలారు.

యశస్వీభవ



ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల చదువులకు ఊతమివ్వాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా (పీఎం యశస్వి) పథకం అమలు చేస్తోంది.

IIలో..

న్యూస్‌రీల్

ఇద్దరికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తూ వివిధ కారణాలతోమరణించిన ఇద్దరు ఉద్యోగుల కుటుంబీకులకు సోమవారం కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా కలెక్టరేట్‌లో కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులు అందజేశారు. ఇద్దరికి గ్రామ సచివాలయంలో గ్రేడ్-2 వీఆర్వోగా, సంక్షేమం, విద్యా కార్యదర్శిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి ఖాళీల సంఖ్యను రోస్టర్, సీనియారిటీ ప్రకారం అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చినట్లు కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఉద్యోగం పొందిన అభ్యర్థులు చిత్తశుద్ధి, అంకితభావంతో పని చేయాలని ఆమె అభ్యర్థులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె శ్రీధర్ రెడ్డి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రతకు చర్యలు

కాకినాడ సిటీ: కలెక్టరేట్ వద్ద ఈవీఎం, వీవీప్యాట్ గోదామును సోమవారం కలెక్టర్ కృతికా శుక్లా, రెవెన్యూ, ఎన్నికలు, అగ్నిమాపక శాఖల అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎంల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెల ఈవీఎం, వీవీప్యాట్ గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి సమగ్ర నివేదికను పంపిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లాలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని వివరించారు.ఆర్డీవో ఎస్‌వీవీ సత్యనారాయణ, పట్టణ తహసీల్దార్ సీతాపతి, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం జగన్నాథం పాల్గొన్నారు.

17న వికాసలో జాబ్ మేళా

కాకినాడ సిటీ: వికాస కార్యాలయంలో ఈనెల 17న డబ్ల్యూ ఎస్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ కంపెనీలో ఉద్యోగానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రాజెక్టు డైరెక్టర్ కె లచ్చారావు సోమవారం తెలిపారు. బీఫార్మసీ, ఎం ఫార్మసీ, బీఎస్సీ లైఫ్ సైన్స్ నేపథ్యం కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి సంవత్సరానికి రూ.2.2 లక్షల జీతం, ఇన్సెంటివ్ ఉంటుందన్నారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నంలో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 17న కాకినాడ కలెక్టరేట్ ఆవరణలోని వికాస కార్యాలయం వద్ద ఉదయం 9 గంటలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని లచ్చారావు వివరించారు.


వలంటీర్ల భర్తీకి నోటిఫికేషన్

కాకినాడ సిటీ: జిల్లాలోని వివిధ గ్రామ సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 75 వలంటీర్ల పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు జెడ్పీ సీఈవో ఏ రమణారెడ్డి సోమవారం తెలిపారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం ఖాళీగా ఉన్న గ్రామ సచివాలయాల్లో అర్హులైన, ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. కొత్త నిబంధనల ప్రకారం జిల్లాలో స్థాయిలో ఎప్పటికప్పుడు ఏర్పడిన ఖాళీలను సంబంధిత ఎంపీడీవోల నుంచి వచ్చిన వెంటనే భర్తీ చేస్తామన్నారు. ఈనెల 16 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఈనెల 18వతేదీ లోపు అభ్యర్థులు దరఖాస్తులు చేయాలన్నారు. గడువు ముగిసిన వెంటనే సంబంధిత ఎంపీడీవోలు మౌఖిక పరీక్షను నిర్వహించి ఎంపిక చేస్తారని జెడ్పీ సీఈవో రమణారెడ్డి వివరించారు.

21 వార్డులు ఏకగ్రీవం

19న జార్జిపేట సర్పంచ్..6వార్డులకు ఎన్నిక

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలో ఖాళీగా ఉన్న ఒక సర్పంచ్, 27 వార్డు సభ్యులకు ఈ నెల 6న జిల్లా పంచాయతీ అధికారి ఆర్ విక్టర్ నోటిఫికేషన్ విడుదల చేశారు. తాళ్లరేవు మండలం జార్జిపేట సర్పంచ్, జిల్లాలోని వివిధ గ్రామ పంచాయతీల్లో 27 వార్డు సభ్యులు నోటిఫికేషన్ విడుదల కాగా వీటిలో 21 వార్డు సభ్యులకు ఒక్కొక్క నామినేషన్ పడడంతో ఏకగ్రీవమయ్యాయి. ఒక సర్పంచ్, 6 వార్డు సభ్యులు ఈ నెల 19న ఎన్నికలు జరగనున్నాయి. తాళ్లరేవు మండలం జార్జిపేట సర్పంచ్ పదవికి ముగ్గురు బరిలో ఉన్నారు. వార్డు సభ్యుల పదవులకు గాను పెదపూడి మండలం కాండ్రేగుల 2, సామర్లకోట మండలం వేట్లపాలెం 3, సామర్లకోట మండలం చంద్రపాలెం 2, పెద్దాపురం మండలం దివిలి 2, గొల్లప్రోలు మండలం కొడవలి 4, ప్రత్తిపాడు మండలం గజ్జనపూడిలో ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. సర్పంచ్‌తోపాటు వార్డు సభ్యులకు ఈ నెల 19న ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజుమధ్యాహ్నం 2 గంటలు నుంచి ఓట్లు లెక్కింపు జరుగుతుంది. లెక్కింపు అనంతరం విజేతలు ప్రకటిస్తారు..



“గ్రామాలు బాగుంటేనే... దేశం బాగుంటుంది” - మహాత్మాగాంధీ

పల్లెలకే ప్రభుత్వం వచ్చింది

గత ప్రభుత్వాల పాలనకు భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వాన్ని గ్రామాలకే తీసుకొచ్చారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, అడంగళ్ పత్రాలు, విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో సహా రిజిస్ట్రేషన్లు సైతం సచివాలయాల్లో జరగనుండడం శుభపరిణామం. ప్రజలకు అందుబాటులో ప్రభుత్వం ఉండడంతో అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నిజమైన గ్రామ స్వరాజ్యమంటే ఇదేనని నమ్ముతున్నాను.

రావుల ప్రసాద్, వాకాడ, కరప మండలం

సచివాలయాలకు వెళ్తే పనులు పూర్తి

గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ఏర్పాటయ్యేలా ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టింది. ప్రభుత్వ సేవలను గ్రామ ప్రజలకు చేరువచేసింది. ఉద్యోగుల విధుల నిర్వహణ, ప్రజలకు సేవలందించేందుకు కోట్లాది రూపాయలతో కొత్త భవనాలు సమకూర్చుతోంది. సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ కేంద్రాలతో గ్రామాలు కొత్త హంగులు సమకూర్చుకొని కళకళలాడుతున్నాయి. గతంలో ఏ కావల్సి వచ్చినా దూరంగా ఉన్న పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. కష్టపడి వెళ్లినా పనులయ్యేవి కాదు. ఇపుడు సచివాలయాలకువెళితే పనులు పూర్తవుతున్నాయి.

బలగం ప్రసన్నకుమార్, మాజీ సర్పంచ్, తూరంగి.

గ్రామాల్లో ప్రభుత్వ శాఖల భవనాలకు వెచ్చిస్తున్న నిధులు

భవనం	నిర్మాణ విలువ
సచివాలయం	రూ. 40 లక్షలు
విలేజ్ హెల్త్ క్లినిక్	రూ. 17.50 లక్షలు
ఆర్బీకే	రూ. 21.80 లక్షలు
డిజిటల్ లైబ్రరీ	రూ. 16 లక్షలు
పాల సేకరణ కేంద్రం	రూ. 17.50 లక్షలు
జిల్లాలో పంచాయతీలు	385
గ్రామ సచివాలయాలు	620
రైతు భరోసా కేంద్రాలు	414
పల్లెలో ప్రభుత్వ భవనాలు	1732
సచివాలయ సేవలు	573

గాంధీమాట.. జగన్ బాట

- పల్లె చెంతకు ప్రభుత్వ పాలన
- గ్రామంలోనే అన్ని ప్రభుత్వ సేవలు
- గ్రామ స్వరాజ్యానికి కొత్త భాష్యం
- రూపురేఖలు మారుతున్న పల్లెలు



సేవలకు చిరునామా : గురజనాపల్లి గ్రామ సచివాలయం



చేదోడు వాదోడు : రైతు భరోసా కేంద్రం

కాకినాడ సిటీ: మహాత్మాగాంధీ ఆకాంక్షించిన గ్రామ స్వరాజ్యాన్ని సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వలంటీర్.. సచివాలయాలు.. రైతు భరోసా కేంద్రాలు... హెల్త్ క్లినిక్‌లు.. బల్క్‌మిల్క్ యూనిట్లు.. డిజిటల్ లైబ్రరీలు. ఇలా అన్నిరకాల సేవలు గ్రామాల్లోనే అన్ని వర్గాలకు అందజేస్తోంది. గ్రామ స్వరాజ్యం గురించి గతంలో చాలామంది పాలకులు మాటలు చెప్పేవారు. గాంధీజీ బాట ఆదర్శనీయమనేవారు. కానీ ఇవేమీ ఆచరణ సాధ్యం చేసేవారు కాదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. గాంధీజీ మాటలకు తన పాలనలో కార్యరూపమిస్తోంది. ముఖ్యంగా గ్రామాల చెంతకు పాలన తీసుకువచ్చి నవపథాన్ని ఆవిష్కరించింది.

ఆచరణ సాధ్యం : అధికారం చేపట్టిన నాలుగేళ్లలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధికి, సంక్షేమానికి కొత్త నిర్వచనం పలికారు. సంకల్పయాత్రలో పల్లెల్లో ప్రజలు అనుభవిస్తున్న కష్టాలను కళ్లారా చూశారు. ఇవన్నీ గ్రామ స్వరాజ్యంతోనే సాధ్యమని భావించారు. పాలనాపగ్గాలు చేపట్టాక దానిని ఆచరణలో చేసి చూపారు. ఫలితంగా నేడు పల్లెల్లో ప్రభుత్వ పథకాలు ఫలాలు నేరుగా అందుతున్నాయి. ప్రగతి బాట పడుతున్నాయి. ఇందుకు సచివాలయ వ్యవస్థ ఆయువుపట్టుగా నిలిచింది. ఈ వ్యవస్థ నుంచి ప్రజలకు అన్నీ అందేలా ఏర్పాట్లు చేశారు. ఆరంభంలో ఈ విధానం అర్థం కాని చాలామంది విమర్శలు చేశారు. తర్వాత వీటి ఫలితాలు చూసి నోటికి తాళం వేసుకున్నారు.

పల్లె చెంతనే సేవలు

ఒకప్పుడు అనారోగ్యం వస్తే మండల కేంద్రానికో లేదా నియోజక వర్గ కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేది. గ్రామీణ ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తున్న ప్రభుత్వం ఈ బాధలను తప్పించింది. విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించింది. వారానికోమారు డాక్టర్లు ఇళ్ల వద్దకే వచ్చి పరీక్షలు నిర్వస్తున్నారు. ఉచితంగా మందులు అందజేస్తున్నారు. తమ గ్రామంలోనే ఆర్బీకేలు ఏర్పాటవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కేంద్రాల్లోనే ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంటున్నాయి. అంతేకాదు వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలుకు ఇదే కేంద్రాలుగా నిలుస్తున్నాయి. ఇక్కడే ధాన్యం కొనుగోళ్లు చేపడుతున్నారు. పంచాయతీలకు ఆదాయ వనరులు పెంచేందుకు గ్రామ శివార్లలో చెత్త నుంచి సంపదను సృష్టించే కేంద్రాలను ఏర్పాటు చేసింది. పరోక్షంగా సేంద్రియ ఎరువులు అందుబాటులోకి తెచ్చింది. పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర లభించేలా చూస్తోంది. ఇలా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం అన్ని సేవలందిస్తూ గ్రామ స్వరాజ్యానికి కొత్త భాష్యం పలుకుతోంది.

పల్లెలో పాలనావ్యవస్థకు పునాది

ప్రతి పల్లె పటిష్టమైన పాలనా వ్యవస్థకు జగన్ ప్రభుత్వం పునాదులు వేసింది. కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలే ఇందుకు తార్కాణం. ఏ గ్రామంలో చూసినా ప్రభుత్వానికి చెందిన వివిధ భవనాలు నిర్మాణ దశలో కనిపిస్తున్నాయి. కొన్ని ఇప్పటికే పూర్తయ్యాయి. పల్లెల్లో ప్రభుత్వ పాలనకు వేదికైన సచివాలయ వ్యవస్థను 2019 అక్టోబర్ 2న కాకినాడ రూరల్ నియోజకవర్గంలోని కరపలో ప్రారంభించింది. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో గ్రామీణ ప్రజలకు ప్రభుత్వం చేరువైంది. వ్యయ ప్రయాసలకు లోనై దూర ప్రాంతాలకు వెళ్లే యాతన తప్పింది. ప్రజలకు తమ గ్రామంలోనే అన్ని శాఖలకు సంబంధించిన పనులూ పూర్తవుతున్నాయి. ఈ విషయంలో వలంటీర్ల పాత్ర ప్రముఖమైన స్థానం పొందింది. అందుకే ఈ వ్యవస్థ జనాభిమానాలను సొంతం చేసుకుంటోంది. సచివాలయాల్లో వివిధ శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉంటూ 573కి పైగా సేవలు అందిస్తున్నారు.

స్వాతంత్య్ర దిన వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

కాకినాడ సిటీ: జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో స్వాతంత్య్ర దినోత్సవం నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. మంగళవారం జరిగే ఈ వేడుకల్లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పశుసంవర్ధక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖా మాత్యులు సిదిరి అప్పలరాజు పాల్గొంటారు. ఉదయం 9 గంటలకు జాతీయపతాకాన్ని ఆవిష్కరించి ప్రజలనుద్దేశించి మాట్లాడతారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. వివిధ పాఠశాల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు, పోలీసులు కవాతు నిర్వహణకు వీలుగా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. ఉదయం 9 గంటలకు జాతీయ పతాకం ఆవిష్కరించిన అనంతరం 9.05 నుంచి 9.15 గంటల వరకు పోలీసులు నిర్వహించే సాంప్రదాయ కవాతుతో పోలీసు గౌరవ వందన స్వీకరిస్తారు. 9.15 నుంచి మంత్రి వర్యులు జిల్లాలో ఇప్పటి వరకు సాధించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు.. తదితర సంక్షేమ వివరాలను తెలియజేస్తారు. 9.30 గంటల పోలీసు కవాతు నిర్వహిస్తారు. 10 గంటలకు వివిధ ప్రభుత్వ శాఖలచే అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు ద్వారా లబ్ధి పొందుతున్న వాటిపై ప్రగతి శకటాల ప్రదర్శన, 10.30 గంటలకు వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. వివిధ శాఖల్లో అత్యుత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు, అధికారులకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

16న హ్యాండ్‌బాల్ సీనియర్ పురుషుల జట్టు ఎంపిక

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16న సీనియర్ పురుషుల విభాగంలో జిల్లా జట్టు ఎంపికను నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు. స్థానిక ఇంద్రపాలెం లాకుల వద్ద ఐడియల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో సాయంత్రం 4 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఎంపికైన జట్టు ఈనెల 18 నుంచి 20 వరకు ప్రకాశం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో జిల్లా తరుపున పాల్గొంటుందన్నారు. ఆసక్తి గల వారు ఎంపికలకు హాజరుకావాలని, వివరాలకు 72072 33939 నెంబరులో సంప్రదించాలని కోరారు.

680 అడుగుల త్రివర్ణ పతాకం



680 అడుగుల జాతీయ జెండాతో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

కొత్తపల్లి: ఆజాదీకా అమృత మహోత్సవాల్లో భాగంగా కొత్తపల్లి మండలం కొండెవరంలో సోమవారం స్థానిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, ఎంపీటీసీ మారిశెట్టి వరలక్ష్మి ఆధ్వర్యంలో 680 అడుగల పొడవు గల జాతీయ పతాకంతో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పిఠాపురం-ఉప్పాడ రోడ్డులో జై భారత్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ ఉమ్మిడి జాన్ గ్రామ ఉపసర్పంచి మేడిశెట్టి శ్రీరాములు, సచివాలయ కన్వీనర్ గాది గంగాబాబు, వాసంశెట్టి సూర్య ప్రకాష్, మారిశెట్టి శ్రీనివసరావు, మేడిశెట్టి జగదీష్, ఎండపల్లి ఉప సర్పంచి గుండ్ర శ్రీధర్, కొమరగిరి వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎంతో ఎంపీ భేటీ

రాజమహేంద్రవరం రూరల్: విజయవాడలో డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఏ పాటిల్‌తో ఎంపీ మార్గాని భరత్‌రామ్ సోమవారం భేటీ అయ్యారు. నిడదవోలు, అనపర్తి నియోజకవర్గం కేశవరం ఎల్సీల వద్ద ఆర్వోబీల నిర్మాణం, అనపర్తి, నిడదవోలు స్టేషన్లలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్, గోదావరి స్టేషన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి తదితర అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మీడియాతో మాట్లాడుతూ రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రైల్వే బోర్డు ఇప్పటికే కొన్ని అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపిందన్నారు. వాటిని సాధ్యమైనంత త్వరగా చేపట్టాలని కోరినట్టు ఎంపీ తెలిపారు. రాజమహేంద్రవరంలో ఖాళీ రైల్వే ఖాళీ స్థలాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. ప్రధాన రైల్వేస్టేషన్ తూర్పున అభివృద్ధి చేయాలని కోరామన్నారు. డీసీఎం రాంబాబు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ఉన్నారు.

జగనన్న కాలనీలో పనులు వేగవంతం

అధికారులకు కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశం

సామర్లకోట: స్థానిక ఈటీసీ జగనన్న లేఆవుట్‌లో పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. సామర్లకోటలోని జగనన్న లేఅవుట్‌లో జరుగుతున్న పనులను సోమవారం ఆమె పరిశీలించారు. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామర్లకోట జగనన్న లే అవుట్‌లో జరిగే సామూహిక గృహ ప్రవేశాల కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ మేరకు జగనన్న కాలనీలో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైపులైను పనులతో పాటు ముఖద్వార పనులను ఆమె పరిశీలించారు. ఆయా శాఖలకు చెందిన అధికారులు పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నాణ్యతలో రాజీ లేకుండా చూడాలన్నారు. కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేసేలా లబ్ధిదారుల్లో చైతన్యం కలిగించాలన్నారు. వారికి అవసరమైన సహాయం, సలహాలు ఇస్తూ వారి సమస్యలు పరిష్కరించాని సూచించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, జెడ్పీ సీఈఓ రమణారెడ్డి, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, మెప్మా పీడీ ప్రియంవద, డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి, ఎంపీడీఓ డి.శ్రీలలిత, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి తదితరులు పాల్గొన్నారు.



సామర్లకోట జగనన్న కాలనీలో పనులను పరిశీలించిన కలెక్టరు, జెసీ తదితరులు

పిఠాపురంలో టీడీపీకి ఎదురు దెబ్బ



ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన విశ్వబ్రాహ్మణులు

వైఎస్సార్‌సీపీలో భారీ చేరికలు

పిఠాపురం: పిఠాపురంలో టీడీపీకి ఎదురు దెబ్బ తగిలింది. ఒక సామాజిక వర్గానికి చెందిన అధిక సంఖ్యాకులు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పిఠాపురానికి చెందిన టీడీపీ క్రియాశీలక సభ్యులైన వంద మంది విశ్వబ్రాహ్మణులు సోమవారం పిఠాపురంలో ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పెండెం దొరబాబు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వరదా వీరభద్రం, పిల్యాణం వీరబాబు, శివకోటి శివ, వీరమళ్ల వీరభద్రం, నవర శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతు టీడీపీ స్థానిక నాయకుడి ఒంటెద్దు పోకడలు భరించలేక ఆ పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. అన్ని విధాలుగాను విశ్వబ్రాహ్మణులకు ఆసరాగా నిలిచిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలుస్తామన్నారు. ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నామన్నారు. కుల మత వర్గ విభేధాలు లేకుండా అవినీతికి అవకాశం లేకుండా సీఎం చేస్తున్న అభివృద్ధి తమను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. కార్యక్రమంలో పలువురు విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

కాంతులీనిన వంతెన

రాజమహేంద్రవరంలోని గోదావరిపై హేవలాక్ వంతెన త్రివర్ణశోభను సంతరించుకుంది. స్వాతంత్య్ర వేడుకల సందర్భంగా సోమవారం రాత్రి రంగుల కాంతులతో మెరిసిపోతూ ఆకట్టుకుంది. జెండా రంగుల విద్యుద్దీప కాంతులు చీకటి వేళ గోదావరి నీటిలో ప్రతిబింబించాయి. ఫొటో: సాక్షి రాజమహేంద్రవరం



స్పందన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యత

జిల్లా కలెక్టరు కృతికా శుక్లా



అర్జీదారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టరు, జెసీ, డీఆర్వో, ఆర్డీఓలు

సామర్లకోట: స్పందనలో అర్జీలను నిర్ణీత గడువు లోపులో పరిష్కరించాలని కలెక్టరు కృతికా శుక్లా అన్నారు. సోమవారం జగనన్నకు చెబుదాం(స్పందన) జిల్లా కార్యక్రమాన్ని సామర్లకోట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీల సామర్లకోట వచ్చిన సమయంలో పలు గ్రీవెన్సు తన దృష్టికి వచ్చాయన్నారు. దీంతో ఈసారి ఇక్కడ మండల స్థాయిలోనూ, జిల్లా స్థాయిలోనూ స్పందన కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించే సమయంలో మర్యాదగా మాట్లాడాలని సిబ్బందికి సూచించారు. అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించి తమకు నివేదిక సమర్పించాలన్నారు. ప్రతీ వారం జిల్లా స్థాయి స్పందనలో 500 వరకు అర్జీలు వస్తున్నాయన్నారు. వాటిలో 90 శాతం వరకు పరిష్కరిస్తున్నామన్నారు. వివిధ శాఖలకు సంబంధించి పదే పదే వచ్చే అభ్యర్థనలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టరు సూచించారు. 1902 ద్వారా, డయల్ యువర్ కమిషనర్, యడల్ యువరీ ఎస్పీ వంటి కార్యక్రమాల ద్వారా కూడా వినతులను స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గృహ మంజూరు, ఉపాధి అవకాశాలు, రెవెన్యూ సేవలు, సర్వే, పింఛన్లు, బీమా మంజూరు తదితర అంశాలపై 245 అర్జీలు వచ్చాయని డీఆర్వో కె. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కలెక్టరేట్ ఏఓ జీఎస్ఎస్ శ్రీనివాసు ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనలో 206 వినతులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఎస్ ఇలక్కియ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీ సుబ్బలక్ష్మి, కాకినాడ ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, జెడ్పీ సీఈఓ రమణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, మెప్మా పీడీ ప్రియంవద, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి, వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు



యశస్వీభవ

- కలల సాకారానికి పీఎం యశస్వి
- 9, 10, ఇంటర్ విద్యార్థులకు ఉపకార వేతనాలు
- దరఖాస్తుకు 17 వరకూ గడువు
- వచ్చే నెల 29న అర్హత పరీక్ష

రాయవరం: ప్రతిభ ఉండి ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థుల చదువులకు ఊతమివ్వాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రైమ్ మినిస్టర్ యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డు స్కీమ్ ఫర్ వైబ్రెంట్ ఇండియా (పీఎం యశస్వి) పథకం అమలు చేస్తోంది. ఆర్థిక కారణాలతో మధ్యలోనే చదువు ఆపి, ఉపాధి బాట పట్టే విద్యార్థులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఇతర వెనుకబడిన కులాలు (ఓబీసీ), ఆర్థికంగా వెనుకబడిన కులాలు (ఈబీసీ), నొమాడిక్ (సంచార), సెమీ నొమాడిక్ వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందే అవకాశముంది.

గత ఏడాది నుంచి..

పీఎం యశస్వి కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం గత ఏడాది రూపకల్పన చేసింది. ఇప్పటి వరకూ ఉన్న అతి పెద్ద ఉపకార వేతన పథకాల్లో ఇదొకటి. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారిత మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ పథకాన్ని నిర్వహిస్తోంది. 9, 10 తరగతుల విద్యార్థులకు ఏడాదికి రూ.75 వేలు, ఇంటర్మీడియెట్ చదువుతున్న వారికి ఏడాదికి రూ.1.25 లక్షల మేర ఉపకార వేతనం ఒకేసారి ఇస్తారు. ఎంపికైన విద్యార్థి ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతాకు ఈ మొత్తాన్ని నేరుగా జమ చేస్తారు. దేశంలోని కేంద్ర పాలిత ప్రాంతాలు సహా ప్రతి రాష్ట్రం నుంచి పరిమిత సంఖ్యలో ఈ పథకానికి ఎంపిక చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం మన రాష్ట్రంలో ఈ ఏడాది ఈ స్కాలర్‌షిప్‌లకు 1,401 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

మరో రెండు రోజులే..

దరఖాస్తు గడువు గత గురువారంతో ముగిసిపోగా ఈ నెల 17వ తేదీ రాత్రి 11.59 గంటల వరకూ గడువు పొడిగించారు. దరఖాస్తు చేసుకున్న వారికి వచ్చే నెల 29న స్కాలర్‌షిప్ పొందేందుకు అర్హత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధించిన విద్యార్థులు ఉపకార వేతనానికి అదే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఏ బ్యాంకు ద్వారా పొందాలనుకుంటారో దాని పాస్‌బుక్ ఫొటో కాపీని జత చేయాలి. దరఖాస్తుదారులు ఒక్క నయాపైసా కూడా చెల్లించనవసరం లేదు. పూర్తి ఉచితంగానే దరఖాస్తు చేసుకుని పరీక్ష రాయవచ్చు.

ఇవీ అర్హతలు

- విద్యార్థి భారతీయుడై ఉండాలి.
- కేంద్ర విద్యా శాఖ అధికారిక ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో నిర్వహించే యశస్వి ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించాలి.
- ప్రవేశ పరీక్షకు 8వ తరగతి పూర్తి చేసి ఉండాలి.
- 9, 10 తరగతుల పూర్తయిన వారు కూడా ఇంటర్ వరకూ ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకోవచ్చు.
- తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షలు మించి ఉండకూడదు.
- గ్రామాల్లో నిరుపేదలు, రైతులు, అణగారిన కుటుంబాల్లోని విద్యార్థులకు ప్రాధాన్యం ఇస్తారు.

పరీక్ష విధానమిదీ..

- **మూడు గంటల** పాటు పరీక్ష ఉంటుంది.
- **హిందీ, ఇంగ్లిష్** భాషల్లో నిర్వహిస్తారు.
- **మల్టిపుల్ చాయిస్** క్వశ్చన్ (ఎంసీక్యూ) విధా**నంలో ఓఎంఆర్ షీట్ల**పై పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- **గణితంలో 30** ప్రశ్నలకు 120 మార్కులు, 25 ప్రశ్నలకు 100 మార్కులు, సైన్స్‌లో 20 ప్రశ్నలకు 80 మార్కులు, జనరల్ అవేర్‌నెస్‌లో 25 ప్రశ్నలకు 100 మార్కులు ఉంటాయి. దేశవ్యాప్తంగా 78 నగరాల్లో ఈ పరీక్ష జరుగుతుంది.

దరఖాస్తు చేసుకోవడం ఇలా..

- ఈ స్కాలర్‌షిప్ పొందేందుకు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి.
- ప్రవేశ పరీక్ష రాసేందుకు ఎన్‌టీఏ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోవాలి.
- పేరు, ఈ-మెయిల్, అడ్రస్, పుట్టిన తేదీ, పాస్‌వర్డ్ తదితర వివరాలతో లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకోవాలి.
- అనంతరం దరఖాస్తుదారుకు అప్లికేషన్ నంబర్ వస్తుంది.
- అదే వెబ్‌సైట్‌లో అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావాలి.
- చదువు, గుర్తింపు కార్డు తదితర వివరాల డాక్యుమెంట్ల సాఫ్ట్ కాపీలను అప్‌లోడ్ చేసి సైన్ అప్ చేయాలి.
- దరఖాస్తు ఫారం పూర్తి చేసిన తర్వాత దాని కాపీ ప్రింట్ తీసుకొని దగ్గర ఉంచుకోవాలి.
- పరీక్ష, ప్రవేశ కార్డు జారీ చేసే తేదీ తదితర వివరాలు ఎప్పటికప్పుడు పరిశీలించుకోవచ్చు.

మంత్రి రాజాకు పలువురి పరామర్శ



సత్యనారాయణమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జక్కంపూడి రాజా

తుని: మాతృ వియోగంతో బాధపడుతున్న రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజాను పలువురు ప్రముఖులు పరామర్శించారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని మంత్రి నివాసంలో సోమవారం మంత్రి తల్లి సత్యనారాయణమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యేలు జక్కంపూడి రాజా, పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్, పెండెం దొరబాబు, గొల్ల బాబూరావు, చలమలశెట్టి సునీల్, బీజేపీ నాయకుడు చోడ్రాజు సత్యకృష్ణంరాజు నివాళులు అర్పించి, మంత్రి రాజాను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు మంత్రి రాజాను పరామర్శించారు.

బాపురే..!



అలమూరు: 212 మంది స్వాతంత్య్ర సమరయోధుల పేర్లను నిక్షిప్తం చేస్తూ రూపొందించిన జాతిపిత మహాత్మాగాంధీ చిత్రపటం అబ్బుర పరుస్తోంది. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తూరు సెంటర్‌లోనున్న ఒక ప్రైవేటు స్కూల్‌లో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న యార్లగడ్డ రాజారావు మూడురోజుల పాటు శ్రమించి స్వాతంత్య్ర సమరయోధుల పేర్లను సేకరించి ఈ చిత్రపటాన్ని రూపొందించారు. స్వాతంత్రోద్యమంలో పోరాడి అమరవీరులైన స్వాతంత్య్ర సమరయోధులను నేటి తరానికి తెలియజేయాలన్న ఉద్దేశంతో ఈ చిత్రపటాన్ని రూపొందించినట్టు ఆయన పేర్కొన్నారు.

పాముకాటుకు ఏడేళ్ల బాలిక మృతి



సుమశ్రీ (ఫైల్)

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఓదూరు శివారు జువ్విపాడులో విషాద ఘటన చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో ఏడేళ్ల బాలిక పొట్లకాయల సుమశ్రీ మృతి చెందింది. స్థానికులు, రామచంద్రపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పొట్లకాయల సూర్యమోహన్‌రావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు నవ్యశ్రీ, సుమశ్రీలతో కలసి జువ్విపాడులో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి చిన్నమ్మాయి సుమశ్రీ మంచంపై పడుకుని ఏడుస్తుండటంతో తల్లి ఏమైందని అడిగింది. తన కుడి పాదం మధ్య వేలు వద్ద మంట వస్తోందని ఆ బాలిక తెలిపింది. పరిసరాల్లో ఏమైనా విషపు పురుగులు, పాముగాని ఉందేమోనని వెతకగా ఏమీ కనిపించలేదు. భర్త లారీ పని మీద పారుగూరికి వెళ్లడంతో స్థానికుల సహకారంతో రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తల్లి సుశీల ఫిర్యాదు, ఆసుపత్రి సమాచారంతో రామచంద్రపురం అడిషనల్ ఎస్సై ఏవీ సీతారామాచార్యులు కేసు నమోదు చేశారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిక వేళంగి సమీపంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. చలాకీగా ఉండే బాలిక మృతితో తల్లిదండ్రుల శోకాన్ని ఎవరూ ఆపలేకపోతున్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రత్నగిరిపై ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధం

- నేటి నుంచి అమలులోకి..
- గాజు, రాగి, స్టీలు, నాన్ ప్లాస్టిక్ 'బయో ఎలైట్' వాటర్ బాటిల్స్ విక్రయాలకు ఆదేశం
- 750 ఎంఎల్ గాజు వాటర్ బాటిల్ రూ.60
- ఖాళీ బాటిల్ తిరిగిస్తే రూ.40 వాపస్



అన్నవరం దేవస్థానం



బయో ఎలైట్ వాటర్ బాటిల్

అన్నవరం: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం తరువాత ప్లాస్టిక బాటిల్స్ నిషేధించిన రెండో దేవస్థానంగా కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం చరిత్రలో మిగిలిపోనుంది. మంగళవారం నుంచి దేవస్థానంలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్ నిషేధం అమలులోకి రానుంది. ప్లాస్టిక్ బాటిల్స్ స్థానంలో గాజు వాటర్ బాటిల్స్, రాగి, స్టీలు, నాన్ ప్లాస్టిక్ 'బయో ఎలైట్' వాటర్ బాటిల్స్ మాత్రమే వినియోగించాలని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశాలు జారీచేశారు. దేవస్థానంలోని అన్ని ఫ్యాన్సీ, కూల్‌డ్రింక్స్ షాపుల నిర్వాహకులు ఈ బాటిల్స్‌ని మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. ప్లాస్టిక్ బాటిల్స్ ఏ షాపులో ఉన్నా రూ.500 జరిమానా విధించాలని ఆదేశించారు. భక్తుల కోసం దేవస్థానంలో ఎనిమిది చోట్ల మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి అక్కడ గ్లాసులు కూడా ఉంచినట్టు తెలిపారు.

నేడు బయో ఎలైట్ నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్ ఆవిష్కరణ

రాష్ట్రంలోనే తొలిసారిగా హైదరాబాద్‌కు చెందిన 'బయో ఎలైట్' సంస్థ మొక్కజొన్న గింజల పొడికి రసాయనాలు కలిపి తయారు చేసిన నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్‌ను మంగళవారం దేవస్థానంలో ఆవిష్కరించనున్నారు. ఈ బాటిల్‌ను రూ.40కి విక్రయించడానికి దేవస్థానం అనుమతి ఇచ్చిందని ఆ సంస్థ ఎండీ దిలీప్ తెలిపారు. ఈ వాటర్ బాటిల్స్ నాన్ ప్లాస్టిక్ అని రాష్ట, కేంద్ర సంస్థలు ధ్రువీకరించిన విషయం విదితమే. ఈ బాటిల్‌ను మూడు నెలల వరకు వాడుకోవచ్చు అని తెలిపారు. తరువాత ఈ బాటిల్స్‌కు పగుళ్లు వచ్చి క్రమంగా వినియోగానికి పనికిరాకుండా పోతాయని ఆయన వివరించారు.

ద్వారకా తిరుమల దేవస్థానంలోనూ..

తూర్పుగోదావరి జిల్లా ద్వారకా తిరుమల దేవస్థానంలో బయో ఎలైట్ వాటర్ బాటిల్స్ విక్రయించేందుకు అవకాశం ఇవ్వాలని ఆ దేవస్థానం ఈఓ వి.త్రినాథరావును కోరినట్లు ఆయన తెలిపారు. ఆయన కూడా సానుకూలంగా స్పందించారని దిలీప్ వివరించారు.

రూ.60కి 750 ఎంఎల్ గాజు వాటర్ బాటిల్ విక్రయం

అన్నవరం దేవస్థానంలో బయో ఎలైట్ నాన్ ప్లాస్టిక్ వాటర్ బాటిల్స్‌తో బాటు 750 ఎంఎల్ గాజు వాటర్ బాటిల్ ను రూ.60 కి అమ్మేందుకు అనుమతించారు. ఖాళీ గాజు సీసాను తిరిగి ఇస్తే రూ.40 వాపస్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

బ్యాంకు ఖాతాల నుంచి రూ.30వేలు మాయం

నల్లజర్ల: సైబర్ మోసాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. తాజాగా నల్లజర్ల మండలం అనంతపల్లిలో ఇద్దరు బ్యాంకు ఖాతాల్లోని రూ.30,600 మాయమయ్యాయి. గ్రామానికి చెందిన మోటార్ మెకానిక్ దాసు రాజా ఖాతా నుంచి ఈ నెల 12,13 తేదీలలో రూ.20 వేలు కాజేశారు. అదే గ్రామానికి చెందిన రైతు బోయపాటి సుబ్బారావు ఖాతా నుంచి ఒక రోజు రూ.10వేలు, మరో రోజు రూ.600 కాజేశారు. ఖాతాను పరిశీలిస్తే ఆధార్ కార్డుతో వేలిముద్ర వేసి డబ్బు తీసుకున్నట్టుగా ఉందని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. నెలరోజుల ముందు పాల వ్యాపారి గురుమిల్లి శ్రీనివాస్ ఖాతా నుంచి రూ.20వేలు లాక్కున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తల్లిదండ్రులు మందలించారని పరారీ



గుబ్బల సురేష్ (పాత చిత్రం)

సామర్లకోట: తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి ఒక బాలుడు వెళ్లిపోయిన ఘటన ఇది. సామర్లకోట పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన గుబ్బల సురేష్ (14) వారం రోజులుగా స్కూల్‌కు వెళ్లకుండా సెల్‌ఫోన్ చూస్తున్నాడు. దాంతో ఈ నెల 12వ తేదీన తల్లిదండ్రులు సురేష్‌ను మందలించారు. దాంతో సెల్‌ఫోన్ పగులకొట్టాడు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో సైకిలు మరమ్మతు చేయించుకొంటానని చెప్పి బయటకు వెళ్లి ఇంటికి రాలేదు. దాంతో తల్లిదండ్రుల బంధువుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో సోమవారం సాయంత్రం సామర్లకోట పోలీసు స్టేషన్‌లో బాలుని తండ్రి గుబ్బల నాగేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. ఎస్సై టి.సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో బాలుడు ఎరుపు నలుపు చారలు కలిగిన టీ షర్టు, బ్లూ కలరు జీన్ ఫ్యాంటు ధరించినట్టు చెప్పారు. బాలుని ఆచూకీ తెలిసినవారు సీఐ కె.దుర్గాప్రసాద్ 9440796568, ఎస్సై సునీత 9701626506కు తెలియజేయాలన్నారు.

స్కూల్ బస్సుకి త్రుటిలో తప్పిన ప్రమాదం



స్టీరింగ్ రాడ్డు విరిగిపోవడంతో అదుపు తప్పి బోదెలోకి వెళ్లిన బస్సు

అల్లవరం: అమలాపురంలోని భాష్యం విద్యా సంస్థకు చెందిన బస్సు కోడూరుపాడు వద్ద అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. అమలాపురం నుంచి బయలుదేరిన బస్సు అల్లవరంలో కొంతమంది పిల్లలను దింపేసి తిరిగి కోడూరుపాడు వెళ్తుండగా ఆక్వా చెరువుల వద్ద స్టీరింగ్ రాడ్ విరిగి బస్సు అదుపు తప్పింది. రోడ్డు పక్కనే ఉన్న బోదెలోకి వెళ్లి వాలిపోయింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 16 మంది విద్యార్థులు ఉన్నారు. స్థానికులు బస్సులో ఉన్న విద్యార్థులను బయటకు తీసుకొచ్చారు. విద్యార్థులు సురక్షితంగా ఉండడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఏసీబీకి చిక్కిన ఎలక్ట్రికల్ లైన్‌మన్



ఏసీబీకి చిక్కిన లైన్‌మన్ అల్లు తాతాజీ

శంఖవరం: మండలంలోని నెల్లిపూడి గ్రామంలో ఎలక్ట్రికల్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న అల్లు తాతాజీ రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. అవినీతి నిరోధక శాఖ అదనపు ఎస్పీ సీహెచ్ సౌజన్య వివరాల ప్రకారం గ్రామానికి చెందిన రైతు సైపిరెడ్డి శ్రీను పొలంలో విద్యుత్ కనెక్షన్ వేసేందుకు రూ.5 వేలు డిమాండ్ చేశాడు. దీంతో రైతు ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు రైతు నుంచి నగదు తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకున్నట్లుగా తెలిపారు. బాధితుడిని కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్లు వి.పుల్లారావు, డి.వాసు పాల్గొన్నారు.

ఎరువుల సీజ్

కడియం: మండలంలోని మాధవరాయుడుపాలెంలో విజిలెన్స్ అధికారులు సోమవాం తనిఖీలు చేపట్టారు. శ్రీ వెంకట మారుతి ఆగ్రో ఏజెన్సీస్ షాపులో తనిఖీలు చేయగా స్టాక్ రిజిస్టర్ నిర్వహించకపోవడం, రైతులకు బిల్లులు ఇవ్వకపోవడం, లైసెన్స్ ప్రదర్శించకపోవడం, స్టాక్ బోర్డు అప్‌డేట్ చేయకపోవడాన్ని అధికారులు గుర్తించారు. దీంతో షాపులోని రూ.1,86,360ల విలువైన 6.8 మెట్రిక్ టన్నుల ఎరువులను వ్యవసాయాధికారి భార్గవ్ సీజ్ చేశారు. వ్యవసాయ, పోలీసు, తూనికలు కొలతల శాఖ సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు.